క్లుప్తంగా

అదనపు టీఎంసీ పనుల్లో వేగం పెంచాలి



సమీక్షిస్తున్న ఆర్డీవో పవన్‌కుమార్

బోయినపల్లి: మండలంలో చేపడుతున్న కాళేశ్వరం ప్రాజెక్టు అదనపు టీఎంసీ వరద కాల్వ పనుల్లో వేగం పెంచాలని వేములవాడ ఆర్డీవో పవన్‌కుమార్ అన్నారు. గురువారం పనుల పురోగతిపై స్థానిక తహసీల్దార్ దర్పెల్లి నరేశ్‌తో కార్యాలయంలో సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భూసేకరణ, ఎంజాయ్‌మెంట్ సర్వే పనులు వేగవంతం చేయాలని పేర్కొన్నారు. అర్హులకు పరిహారం అందేలా చూడాలన్నారు. ఎంజాయ్‌మెంట్ సర్వే ఎంతవరకు జరిగింది. పరిహారం ఎంతమందికి ఇచ్చారు. తదితర అంశాలు సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. పరిహారం అందించే పనుల్లో స్పీడ్ పెంచాలని సూచించారు. ఆర్‌ఐ.ప్రభాకర్‌తో పాటు సిబ్బంది ఉన్నారు.

కల్యాణలక్ష్మి పేదింటికి అండ



చెక్కు అందజేస్తున్న ఎమ్మెల్యే రసమయి

ఇల్లంతకుంట: కూతురు పెళ్లి తల్లిదండ్రులకు భారం కావొద్దనే ఉద్దేశ్యంతోనే సీఎం కేసీఆర్ కల్యాణలక్ష్మి పథకానికి రూపకల్పన చేశారని మానకొండూర్ ఎమ్మెల్యే, తెలంగాణ సాంస్కృతిక సారథి చైర్మన్ రసమయి బాలకిషన్ అన్నారు. మండలంలోని పత్తికుంటపల్లి, తాళ్లపల్లి, గాలిపల్లి, జవారిపేట గ్రామాల్లో గురువారం లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి చెక్కులను అందజేశారు. కార్యక్రమంలో జెడ్పీ వైస్‌చైర్మన్ సిద్ధం వేణు, ఎంపీపీ వెంకటరమణారెడ్డి, ఏఎంసీ చైర్మన్ మామిడి సంజీవ్, టీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు పల్లె నర్సింహారెడ్డి, సెస్ డైరెక్టర్ రవీందర్‌రెడ్డి, వైస్‌ఎంపీపీ శ్రీనాథ్‌గౌడ్, సర్పంచుల ఫోరం అధ్యక్షుడు చల్ల నారాయణ, పీఏసీఎస్ వైస్‌చైర్మన్ గౌడుగు తిరుపతి, సర్పంచులు శ్రీలత, పద్మ, వాణి పాల్గొన్నారు.

కంటి వెలుగు ప్రారంభం



శిబిరాన్ని ప్రారంభిస్తున్న జెడ్పీటీసీ నర్సయ్య

ముస్తాబాద్: మండలంలోని రామలక్ష్మణపల్లెలో కంటి వెలుగు శిబిరాన్ని జెడ్పీటీసీ గుండం నర్సయ్య గురువారం ప్రారంభించారు. మోహినికుంటలో కంటి వెలుగు శిబిరాన్ని సర్పంచ్ కల్వకుంట్ల వనజ ప్రారంభించారు. సెస్ డైరెక్టర్ సందుపట్ల అంజిరెడ్డి, సర్పంచులు రవీందర్‌రెడ్డి, కిషన్‌రావు, బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు సురేందర్‌రావు, ఉపసర్పంచులు రాజిరెడ్డి, సంధ్య, వైద్యాధికారి గీతాంజలి, ఏఎంసీ మాజీ చైర్మన్ జానబాయి, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

జాప్యం.. నాణ్యతాలోపం

- ధర్మారం-అగ్రహారం రోడ్డు పనుల్లో నాణ్యత కరువు
- ఆందోళన చేస్తున్న గ్రామస్తులు
- రోడ్డు పనులు పూర్తి చేయాలని వినతి

కోనరావుపేట: లక్షలాది రూపాయలను వెచ్చించి నిర్మిస్తున్న తారురోడ్డు పనులు నాసిరకంగా జరుగుతున్నాయని ఆయా గ్రామాల ప్రజలు ఆరోపిస్తున్నారు. అధికారుల పట్టింపు లేని ధోరణితో కాంట్రాక్టర్లు ఇష్టారాజ్యంగా పనులు చేస్తున్నారని, ఈ పనులు మూన్నాళ్ల ముచ్చటగానే మిగిలిపోనున్నాయని ప్రజలు ఆందోళన చెందుతున్నారు. అధికారులు స్పందించి పనులు నాణ్యతతో జరిగేలా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

కోనరావుపేట మండలం ధర్మారం నుంచి నాగారం, రామన్నపేట, చంద్రగిరి మీదుగా అగ్రహారం వరకు గల సుమారు ఏడు కిలోమీటర్ల రహదారిని తారురోడ్డుగా మార్చేందుకు కేంద్ర ప్రభుత్వ గ్రామీణాభివృద్ధి శాఖ నుంచి రూ.2.66 కోట్లు మంజూరు కాగా ఈ పనులను 2021 నవంబర్ 1న ప్రారంభించారు. కొన్ని నెలల క్రితం పనులు ప్రారంభించి అర్ధాంతరంగా నిలిపివేశారు.



అధ్వానంగా తయారైన రామన్నపేట శివారు రోడ్డు

రోడ్డు పూర్తయితే అందరికీ ప్రయోజనం

కోనరావుపేట మండలం ధర్మారం నుంచి మొదలు పెట్టిన రహదారితో నాగారం, రామన్నపేట, చంద్రగిరి గ్రామాల మీదుగా అగ్రహారం వరకు వెళ్లడానికి వీలు కలుగుతుంది. దీంతో ఆయా గ్రామాల ప్రజలకు దూర భారం తగ్గడంతో పాటు సమయం ఆదా అవుతుంది. అన్ని గ్రామాల ప్రజలు ఈ రోడ్డు పూర్తి చేయాలని ఎదురుచూస్తున్నారు. ఈ రోడ్డు పూర్తయితే అన్ని గ్రామాల ప్రజలకు సౌకర్యవంతంగా ఉంటుంది.



దుమ్ములేపుతున్న నాగారం మట్టిరోడ్డు

పనుల్లో నాణ్యతా లోపం

ధర్మారం నుంచి అగ్రహారం వరకు పనులు మొదలుపెట్టిన కాంట్రాక్టర్ మొదటి నుంచి నాణ్యతా ప్రమాణాలు పాటించడంలేదని ఆయా గ్రామాల ప్రజలు ఆరోపిస్తున్నారు. రోడ్డు పనుల్లో నాసిరకం మట్టిని వినియోగిస్తున్నారని, ఈ రోడ్డు మూన్నాళ్ల ముచ్చటగానే మిగులుతుందని ఆరోపిస్తున్నారు.

పనులు నాణ్యతతో చేపట్టాలి



రహదారి పనుల్లో నాణ్యత లోపించింది. పదికాలాల పాటు ఉండాల్సిన పనులు నాణ్యతతో చేపట్టాలని పలుమార్లు కాంట్రాక్టర్‌ను కోరుతున్నా ఫలితం లేకుండా పోతోంది. ఇప్పటికైనా చేస్తున్న పనులు నాణ్యతతో చేపట్టాలని లేనియెడల పనులను అడ్డుకోవడం జరుగుతుందన్నారు.

– బొమ్మెన భాస్కర్‌రావు, నాగారం

ప్రజల కష్టాలు అలాగే ఉన్నాయి



ధర్మారం గ్రామం నుంచి వేములవాడ వెళ్లేందుకు ఈ దారి దగ్గరగా ఉంటుంది. ఈ రోడ్డు పూర్తయితే ప్రజల కష్టాలు తీరుతాయని భావించాం. గడువు తేదీ దగ్గర పడుతున్నా పనులు మాత్రం జరుగడం లేదు. రహదారి పనులు నాణ్యతతో జరిగేలా అధికారులు తగిన చర్యలు తీసుకోవాలి.

– గున్నాల అరుణ, సర్పంచ్, ధర్మారం

త్వరలోనే ప్రారంభమయ్యేలా చూస్తాం



ధర్మారం నుంచి రామన్నపేట, చంద్రగిరి తారు రోడ్డు పనులు బిల్లుల జాప్యం కారణంగా ఆగాయి. పనులు నాణ్యతతో చేయిస్తున్నాం. రహదారి పనుల్లో ఎలాంటి నాణ్యతాప్రమాణాలు లోపించినా సహించేది లేదు. 30 శాతం మేర పనులు జరిగాయి. నాణ్యతా ప్రమాణాలు లోపిస్తే చర్యలు తీసుకుంటాం.

– భూమేశ్వర్, డీఈ, పంచాయతీరాజ్

కల్యాణలక్ష్మి పేదలకు వరం

- నాస్కాబ్ ఛైర్మన్ రవీందర్‌రావు, బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు ఆగయ్య

వీర్నపల్లి: కల్యాణ లక్ష్మి, షాదీముబారక్ పథకం పేదలకు వరం లాంటిందని నాస్కాబ్ చైర్మన్ కొండూరి రవీందర్‌రావు, బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు తోట ఆగయ్య అన్నారు. మండల కేంద్రంలో రైతు వేదిక అవరణలో గురువారం 28 మంది లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి చెక్కులను పంపిణీ చేసిన అనంతరం వారు మాట్లాడారు. రాష్ట్రంలో అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, దేశంలో ఎక్కడా కూడా లేవన్నారు. పేదింటి అడబిడ్డల పెళ్లిళ్లకు పెద్దన్నలా సీఎం కేసీఆర్ అండగా నిలుస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ మాలోత్ భూల, జెడ్పీటీసీ గుగులోత్ కళావతి, సెస్ చైర్మన్ చిక్కాల రామారావు, సెస్ డైరెక్టర్ మాడుగుల మల్లేశం, గ్రామ సర్పంచ్ పాటి దినాకర్, ఎంపీటీసీ అరుణ్ కుమార్, తహసీల్దార్ తాఫాజుల్ హుసేన్, ఎంపీడీవో నరేశ్‌కుమార్, డిప్యూటీ తహసీల్దార్ ఎలుసాని ప్రవీణ్‌కుమార్, బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు రాజిరెడ్డి, మండల నాయకులు పాల్గొన్నారు.



లబ్ధిదారులతో రవీందర్ రావు, ఆగయ్య

విద్యార్థులు మొబైల్ వాడకం తగ్గించాలి

బోయినపల్లి: పాఠశాలలో చదివే విద్యార్థినీ, విద్యార్థులు మొబైల్ వాడకం తగ్గించి చదువుపై దృష్టి సారించాలని సఖీ సెంటర్ కౌన్సిలర్ కళావతి అన్నారు. మండలంలోని కొదురుపాక, వెంకట్రావుపల్లి, నర్సింగాపూర్ హైస్కూళ్లలో సఖీ అవగాహన సమావేశం గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా సఖీ సేవలు, గుడ్ టచ్, బ్యాడ్ టచ్, జెండర్ వివక్షత, ప్రేమ ఆకర్షణ తేడాలు, పోక్సో చట్టం, మొబైల్ వాడకంతో నష్టాలు, ఫొటో ఇమేజెస్ షేరింగ్, సైబర్ క్రైమ్స్ గూర్చి అవగాహన కల్పించారు. విద్యార్థులు మంచి అలవాట్లతో ఉండాలని కోరారు. కార్యక్రమంలో మూడు హైస్కూళ్ల హెడ్ మాస్టర్లు, పారా మెడికల్ ప్రవళిక, విద్యార్థులు పాల్గొన్నారు.



అవగాహన కల్పిస్తున్న కళావతి

చిత్రకథ



ట్రై సైకిళ్ల పంపిణీ ఎప్పుడో..?

చందుర్తి: దివ్యాంగులకు అందజేసేందుకు ప్రభుత్వం సరఫరా చేసిన ట్రై సైకిళ్ల పంపిణీకి గ్రహణం పట్టింది. చందుర్తి మండల పరిషత్ కార్యాలయానికి ట్రైసైకిళ్లను సరఫరా చేసి రెండు మాసాలు గడుస్తున్న లబ్ధిదారులకు అందజేయడంలో జాప్యం జరుగుతోంది. మండలానికి 11 ట్రై సైకిళ్లను సరఫరా చేశారు. వీటిలో ఐదు ట్రైసైకిళ్లను గత నెల 22న పంపిణీ చేసి మిగతా వాటిని కార్యాలయానికే పరిమితం చేశారు. లబ్ధిదారులు మాత్రం ట్రై సైకిళ్లను ఎప్పుడు పంపిణీ చేస్తారోనని ఆశగా ఎదురుచూస్తున్నారు.

వైద్యాధికారికి సన్మానం



గీతాంజలిని సన్మానిస్తున్న గ్రామస్తులు

ముస్తాబాద్: మండలంలోని ఆవునూర్ గ్రామ పంచాయతీలో వైద్యాధికారి గీతాంజలిని గురువారం ఘనంగా గ్రామస్తులు సన్మానించారు. అక్కడే పుట్టి, పెరిగి, ఒక డాక్టర్‌గా స్వగ్రామంలోనే వైద్యాధికారిగా సేవలు అందిస్తున్న గీతాంజలి గ్రామస్తులకు స్ఫూర్తిదాయకమని సర్పంచ్ బద్ది కల్యాణి అన్నారు. ఎంపీటీసీ లలిత, వార్డు సభ్యులు, పంచాయతీ సిబ్బంది ఉన్నారు.

గోదాం ప్రారంభించేదెప్పుడు..?



ప్రారంభానికి సిద్ధంగా ఉన్న గోదాం

వేములవాడరూరల్: వేములవాడ మున్సిపల్ పరిధిలోని శాత్రాజుపల్లిలో పీఏసీఎస్ ఆధ్వర్యంలో రైతన్నల కోసం ఎరువులు నిల్వ ఉంచేందుకు గోదాం నిర్మించి నెలలు గడిచినా ఇంకా ప్రారంభం కాలేదు. రైతులకు అన్ని అందుబాటులో ఉండేలా నిర్మించినా, నిరుపయోగంగా మారింది. ఇప్పటికైనా అధికారులు, పాలకులు వెంటనే గోదాంను ప్రారంభించాలని రైతులు కోరుతున్నారు.

ఇంటర్ ద్వితీయ పరీక్షలు ప్రారంభం

వేములవాడఅర్బన్: ఇంటర్ ద్వితీయ సంవత్సరం వార్షిక పరీక్షలు గురువారం ప్రశాంతంగా ప్రారంభమయ్యాయి ప్రభుత్వ జూనియర్ కళాశాలలో 169 మంది విద్యార్థులకు ముగ్గురు గైర్హాజరు అయ్యారు. వివేకానందలో 225 మందికి 12 మంది, పవిత్ర జూనియర్ కళాశాలలో 244 మందికి 5 విద్యార్థులు గైహాజరు అయ్యారు. సుమిత్ర జూనియర్ కళాశాలలో 156 మందికి ఇద్దరు గైర్హాజరయ్యారు. మొత్తం 794 మందికి 22 మంది గైర్హాజరు కాగా 772 మంది విద్యార్థులు పరీక్షలకు మొదటి రోజు హాజరైనట్లు ప్రభుత్వ జూనియర్ కళాశాలలో సీఎస్ ప్రమోద్ కుమార్‌రెడ్డి తెలిపారు.

సీఎంఆర్‌ఎఫ్ చెక్కులు అందజేత

సిరిసిల్లఅర్బన్: సిరిసిల్ల పట్టణంలోని 17వ వార్డులో పి.రాజ్యలక్ష్మికి రూ.17 వేలు విలువ గల సీఎంఆర్‌ఎఫ్ చెక్కును కౌన్సిలర్ గుండ్లపెల్లి నీరజ అందజేశారు. 1వ వార్డులో జ్యోతినగర్‌కి చెందిన పలువురు లబ్ధిదారులకు మంజూరైన చెక్కులను బీఆర్‌ఎస్ నాయకుడు పోచవేణి ఎల్లయ్య అందించారు.

విద్యార్థులు ఉత్తమ ర్యాంకులు సాధించాలి

ఎల్లారెడ్డిపేట: మండలంలోని రాచర్లబొప్పాపూర్ జెడ్పీ ఉన్నత పాఠశాలలో చదువుతున్న 83 మంది విద్యార్థులకు పరీక్ష ప్యాడ్‌లు, పెన్నులు, ఇతర సామగ్రిని చైల్డ్ ఆర్గనైజేషన్ జిల్లా సభ్యుడు గడ్డం మధు గురువారం అందించారు. 10 జీపీఏతో మొదటి స్థానంలో నిలిచినవారికి సిల్వర్ మెడల్ అందిస్తామన్నారు.ప్రధానోపాధ్యాయులు శ్రీనివాస్ రెడ్డి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

నర్సరీ పరిశీలన

ఇల్లంతకుంట: మండలంలోని జవారిపేట గ్రామంలో ఉపాధి హామీ ద్వారా ఏర్పాటు చేసిన హరిత నర్సరీని ఏపీవో చంద్రయ్య పరిశీలించారు. వేసవికాలం కావడంతో మొక్కలను సంరక్షించేందుకు షేడ్ నెట్లు ఏర్పాటు చేయడంతో పాటు, రోజు రెండు సార్లు నీరు పట్టాలన్నారు. తర్వాత ఇల్లంతకుంటలో మొక్కలను పరిశీలించారు.

సమాచారం

నేడు లబ్ధిదారుల ఎంపికకు ఇంటర్వ్యూలు

గంభీరావుపేట: మైనార్టీ కార్పొరేషన్ రుణాల లబ్ధిదారుల ఎంపిక కోసం గంభీరావుపేట మండల పరిషత్ కార్యాలయంలో శుక్రవారం ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు ఇంటర్వ్యూలు నిర్వహించనున్నట్లు ఎంపీడీవో శ్రీనివాస్ తెలిపారు. దరఖాస్తుదారులు సకాలంలో హాజరుకావాలని ఆయన కోరారు.

18న వేములవాడలో..

వేములవాడరూరల్: వేములవాడ రూరల్ మండలంలో ఉన్న మైనార్టీ యువతీ యువకుల కోసం ఈ నెల 18న ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ రాంరెడ్డి తెలిపారు. ఇప్పటి వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకున్న వారు ఉదయం 11 గంటలకు మండల పరిషత్ కార్యాలయంలో జరిగే ఇంటర్వ్యూలకు హాజరు కావాలని ఆయన తెలిపారు. ఒరిజినల్ ధృవీకరణ పత్రాలతో రావాలని కోరారు.

క్రికెట్ పోటీలు ప్రారంభం



పోటీలు ప్రారంభిస్తున్న ఎంపీపీ బండ మల్లేశం

వేములవాడరూరల్: వేములవాడ మండలం ఎదురుగట్ల గ్రామంలో క్రికెట్ పోటీలను ఎంపీపీ బండ మల్లేశం ప్రారంభించారు. అన్ని గ్రామాల్లో నిర్వహించే ఈ క్రికెట్ పోటీల్లో విజయం సాధించిన వారు ఉమ్మడి జిల్లా స్థాయిలో జరిగే పోటీల్లో పాల్గొంటారని తెలిపారు. కార్యక్రమంలో అన్ని మండలాల నుంచి 12 జట్లు పాల్గొన్నాయని మూడు రోజుల పాటు ఈ పోటీలు నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు కడారి తిరుపతి తెలిపారు.

రుణాల ప్రొసీడింగ్స్ పంపిణీ



ప్రొసీడింగ్స్ పంపిణీ చేస్తున్న సర్పంచ్

బోయినపల్లి: మండలంలోని తడగండ గ్రామంలో 24 మహిళా స్వశక్తి సంఘాలకు వడ్డీలేని రుణాల ప్రొసీడింగ్ కాపీలను సర్పంచ్ బూర్గుల నందయ్య గురువారం అందచేశారు. రూ. 7,75,368 విలువ గల ప్రొసీడింగ్స్ కాపీలను ఆయా స్వశక్తి సంఘాలకు చెందిన మహిళలకు అందించారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి షబానా సుల్తానా స్వశక్తి సంఘాల సభ్యులు పాల్గొన్నారు.

మహిళలు ఆర్థికంగా ఎదగాలి

ఎల్లారెడ్డిపేట: ఎల్లారెడ్డిపేట మేజర్ పంచాయతీ ఆవరణలో 189 మహిళా సంఘాలకు రూ.45 లక్షల వడ్డీకి సంబంధించిన ప్రొసీడింగ్ కాపీలను ఎంపీపీ పిల్లి రేణుక, జెడ్పీటీసీ చీటి లక్ష్మణ్‌రావు గురువారం అందజేశారు. సెస్ డైరెక్టర్ కృష్ణహరి, సింగిల్‌విండో చైర్మన్ కృష్ణారెడ్డి, సర్పంచ్ వెంకట్‌రెడ్డి, ఎంపీటీసీలు నాగరాణి, అనసూయ, ఉపసర్పంచ్ రజిత, వీఓఏలు పాల్గొన్నారు.

వైద్య శిబిరానికి స్పందన

కోనరావుపేట: మండలంలోని మామిడిపల్లి గ్రామంలో కరీంనగర్ ప్రతిమ ఆసుపత్రి ఆధ్వర్యంలో గురువారం నిర్వహించిన వైద్య శిబిరాన్ని ఆసుపత్రి బాధ్యులు చెన్నమనేని వికాస్‌రావు, దీప దంపతులు ప్రారంభించారు. ఈ సందర్భంగా పాఠశాల విద్యార్థినులకు శానిటరీ నాప్‌కిన్స్ ఉచితంగా అందజేశారు. కార్యక్రమంలో సర్పంచ్ కోక్కుల భారత, ఉప సర్పంచ్ ఎల్లాల రాంరెడ్డి, మాజీ సర్పంచ్‌లు, బదుగు లక్ష్మన్, విజయ, లక్ష్మారెడ్డి, క్యాంప్ ఇన్‌చార్జి కౌశిక్, రాజిరెడ్డి, గ్రామస్తులు తదితరులు ఉన్నారు.

ఇసుకను దుర్వినియోగం చేస్తే చర్యలు

ముస్తాబాద్: మండలంలోని ఆవునూర్ మానేరు వాగు ఇసుక రీచ్ నుంచి అనుమతులు పొందిన వారు పొరుగు జిల్లాలకు రవాణా చేస్తే చర్యలు తీసుకుంటామని తహసీల్దార్ మునిందర్ హెచ్చరించారు. చలాన్లతో ఇసుక అనుమతులు పొందిన వారు కొంతమంది జిల్లా సరిహద్దులు దాటిస్తున్నారనే ఫిర్యాదులు వచ్చాయన్నారు. దీనిపై నిఘా పెడుతామన్నారు. ఇసుకను అవసరాల మేరకు తీసుకోవాలని, ప్రభుత్వ పనులకైనా అనుమతులు తప్పనిసరిగా తీసుకోవాలన్నారు.

పంట పొలాలపై కోతుల దాడి

- వానరాలతో నిత్యం ఇబ్బందులు
- అడవులు తగ్గడమే అవస్థకు కారణం
- పట్టించుకోని ప్రజాప్రతినిధులు, అధికారులు

వీర్నపల్లి: కోతుల దండు వస్తుందంటేనే గ్రామీణ ప్రాంతాల్లో హడలెత్తి పోతున్నారు. వానరాలు గ్రామాలపై బడి నానా హంగామా సృష్టిస్తుండడంతో బయటకి రావాలంటేనే జంకుతున్నారు. మండల వ్యాప్తంగా అన్ని గ్రామాల్లో ప్రజలు కోతుల బెడద వేధిస్తోంది.

వనం వీడి జనంలోకి..

అడవుల్లో చెట్ల కొమ్మలపై ఆడుతూ పండ్లు, ఫలాలను తింటూ జీవించే కోతులు ఇప్పుడు అడవులను వదలి ఇళ్లలోకి చొరబడుతున్నాయి. అడవులను యథేచ్ఛగా నరికివేయడంతో కోతులకు తినే ఆహారం దొరకక ఒకేసారి వందల సంఖ్యలో కోతులు ప్రశాంతంగా ఉన్న గ్రామాల్లో చొరబడి ఇళ్లల్లో ఆహార పదార్థాలను ఎత్తుకెళ్లడమే కాకుండా, పంట పొలాల్లో సంచరిస్తూ రైతులు కష్టపడి పండించిన పంటలను పాడు చేస్తుండడంతో రైతులు తీవ్రంగా నష్టపోతున్నారు.

ప్రతి రోజూ నరకమే..

గ్రామాల్లో కోతులు సృష్టిస్తున్న అరాచకం అంతా ఇంతా కాదు, ఏమాత్రం అజాగ్రత్తగా ఉన్నా తలుపులు తీసుకొని ఇళ్లలోకి దూరిపోతున్నాయి. బియ్యం, పప్పు, కూరగాయలు ఇలా ఏవి దొరికితే వాటిని ఎత్తుకెళ్తున్నాయి. అంతటితో ఆగకుండా బట్టల్ని చింపివేయడం, వస్తువులను చిందరవందర చేయడం వంటి వాటికి అంతే లేదు. దీంతో ఇళ్లలో పనులు చేసుకునేందుకు సైతం మహిళలు భయపడుతున్నారు. ఎటువైపు నుంచి కోతుల మంద వచ్చి దాడి చేస్తాయో అని అందోళన చెందుతున్నారు. గ్రామాల్లో కోతులు ఇళ్లపై పెంకులను పగలగొడుతున్నాయి. దీంతో ప్రతి వర్షాకాలం ఇళ్లలోకి నీరువస్తుంది, దాంతో ఇళ్ల పైకప్పుగా పెంకుల బదులు రేకులు వేసుకుంటున్నారు. కాలనీల్లో గుంపులుగా తిరుగుతూ స్థానికులపై దాడులు చేస్తున్నాయి.



పంట పొలాల్లో సంచరిస్తున్న కోతులు

పంటలకు కూడా..

గతంలో అడవి పందుల మూలంగా రైతులు ఇబ్బందులకు గురవగా ప్రస్తుతం వాటి స్థానాన్ని కోతులు భర్తీ చేస్తున్నాయి. మండలంలోని అన్ని గ్రామాల్లో ఇప్పుడు వరి, కూరగాయలు, మొక్కజొన్న పంటలు చేతికొచ్చే సమయంలో నష్టాన్ని కలిగిస్తున్నాయి. గ్రామాల్లో రైతులకు జరుగుతున్న పంట నష్టం ప్రతి ఏటా పెరుగుతున్నదే తప్ప తగ్గటం లేదు. పాలకులు వీటిపై దృష్టిసారించి ఈ సమస్యకు పరిష్కారించాల్సిన అవసరం ఉంది..

రైతులే జాగ్రత్త వహించాలి

కోతులు పంట పొలాలు, ఇళ్లలోకి వస్తే రైతులు, ప్రజలు జాగ్రత్తలు పడి రక్షించుకోవాలి. అడవిపందుల దాడిలో పంట నష్టం వాటిల్లితే వ్యవసాయాధికారి నిర్ధారణ చేసి ధ్రువీకరణపత్రం ఇవ్వాలి. కోతులకు ఐతే అటవీ శాఖ తరుపున ఎటువంటి నష్ట పరిహారం ఉండదు.

– రంజిత్‌కుమార్, ఎఫ్‌ఎస్‌వో, వీర్నపల్లి